మిర్తివలస మాజీ సర్పంచ్ కు ఉత్తమ రైతు అవార్డు

విశాలాంధ్ర-రామభద్రపురం : మిర్తివలస మాజీ సర్పంచ్ కోట రమణకు ఆదివారం యాదగిరిగుట్టలో తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతులమీదుగా ఉత్తమ రైతు అవార్డు అందుకున్నారు. పామాయిల్ సాగులో అధిక దిగుబడులు, ఆధునిక పద్ధతిలో సాగు చేపట్టినందుకుగాను అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు జాతీయ గాంధీ గ్లోబల్ సంస్థ వారు ఈయనకు బహూ కరించారు. ఈ అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని మాజీ సర్పంచ్ కోట రమన అన్నారు.

భద్రతా ప్రమాణాలపై అవగాహన, ఆచరణతోనే ప్రమాదాల నియంత్రణ

ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: రహదారి భద్ర త ప్రమాణాలు పట్ల అవాహన, ఆచరణతోనే జిల్లాలో రహదారి ప్రమాదాలను నియంత్రించ వచ్చునని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. రహదారి భద్రతకు ప్రాధాన్యత కల్పించి, భద్రత చర్యలుచేపట్టాలని, ప్రజలకు రహదారి భద్రత పట్ల అవగాహన కల్పించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాలను నియంత్రించుటలో భాగంగా భద్రతాచర్యలను చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా వాహన దారులకు రహదారి భద్రత పట్ల అవగాహన కల్పించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించే విధంగా చూడాలని, హెల్మెట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలను, పెద్ద ప్రమాదాలు జరిగినప్పటికీ స్వల్ప గాయాలతో ఎలా ప్రాణాలతో సురక్షితంగా భయటపడవచ్చునో ద్విచక్ర వాహనదారులకు వివరించాలన్నారు. హెల్మెట్స్ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో గాలి, దుమ్ము నుండి రక్షించడంతోపాటు, సురక్షిత ప్రయాణాన్ని అందిస్తా యన్నారు. ఊహించని రహదారి ప్రమాదాల నుండి రక్షించే రక్షణ రేఖ హెల్మెట్ ధారణ అని అన్నారు. కావున, ప్రతీ వాహనదారుడు ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమ యంలో నాణ్యత కలిగిన సరిగ్గా అమర్చిన హెల్మెట్స్ ను ధరించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అధికారులను ఆదేశించారు. ప్రతీ రోజూ విజిబుల్ పోలీసింగు నిర్వహించాలని, వాహన తనిఖీలు చేపట్టి, ప్రజలకు, వాహనదారులకు రహ దారి భద్రత, మోటారు వాహన చట్టం గురించి అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాలను నియంత్రించుటలో భాగంగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలన్నారు. డ్రంకన్ డ్రైవ్ చేసిన వారిపై కఠినంగా వ్యవహరించి, కేసులు నమోదు చేయాలన్నారు. అంతేకాకుండా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై దాడులు చేపట్టి, ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై ఓపెన్ డ్రింకింగు కేసులు నమోదు చేయాలన్నారు. ప్రజలకు రహదారి ప్రమాదాల పట్ల అవగాహన కల్పిస్తునే, మరో వైపు ఎం.వి. నిబంధలు ఉల్లంఘిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రమాదాల నియంత్రణలో భాగంగా ఇప్పటికే ప్రతీ పోలీసు స్టేషను పరిధిలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద రహదారి ప్రమాదాలు జరగకుండా బ్లాక్ స్పాట్స్ కు ఇరువైపుల కాషనరీ బోర్డులను ఏర్పాటు చేయడం, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్టాపర్లు, డ్రమ్ములు ఏర్పాటు చేసి, రాత్రి సమయాల్లో వాహనదారులకు కనిపించే విధంగా వాటిపై రేడియం స్టిక్కర్లు అతికించాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. హెల్మెట్స్ ధరించని వారిపై ఈ సంవత్సరంలో ఇప్పటికే 35,204 మందిపై ఎం.వి. చలానాలను విధంచామన్నారు.

ఘనంగా పీ.వీ.రావు 19వ వర్థంతి వేడుకలు

మండల మాల మహానాడు అధ్యక్షుడు దేభార్కి కిరణ్

విశాలాంధ్ర వేపాడ: మండల కేంద్రమైన వేపాడలో స్వర్గీయ పి.వి రావు 19వ వర్థంతి వేడుకలను మండల మాల మహానాడు అధ్యక్షుడు దేబార్కి కిరణ్ ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పి.వి రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేబార్కి కిరణ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడి మాలలను ఏకతాటి పైకి తీసుకువచ్చి మాల మహానాడు స్థాపించి ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో పిటిషన్ వేసి విజయం సాధించిన గొప్ప పోరాటయోధుడన్నారు. మాలలంతా ఐకమత్యంగా ఉండి ఆయన అడుగుజాడల్లో నడుస్తూ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాల మహానాడు నాయకులు టి రవికుమార్, కె అప్పారావు, సిహెచ్ బంగారయ్య,పి సత్య రావు, ఎల్ ఎర్రిబాబు, ఎన్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు పివి. రావు

విశాలాంధ్ర -విజయనగరం టౌన్: మాలజాతి హక్కుల కోసం మాలమహానాడు స్థాపించిఉద్యమమే ఊపిరిగా ఎస్సి వర్గీకరణ రద్దుకోసం చివరి శ్వాస వరకు పోరాడిన పోరాటయోధుడు దళిత రత్నం స్వర్గీయ పి.వి.రావు అని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగీశ. రామకృష్ణ అన్నారు. అదివారం కలెక్టరట్ వెనుక వున్న జిల్లా మాలమహానాడు కార్యాలయం లో స్వర్గీయ పి వి రావు కు కొవ్వొత్తులతో నివాళులు అర్పించి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా లోగీశ రామకృష్ణ మాట్లాడుతూ ఎస్సి వర్గీకరణకు వ్యతిరేకంగా ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటన చేసి మాల జాతిని చైతన్యం చేసేలా వాడ వాడలా వర్గీకరణ వ్యతిరేఖ సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి 1997లో అసెంబ్లీ ముట్టడి చేయించి రాజకీయ పార్టీలలో వణుకు పుట్టించార న్నారు. అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు సపోర్ట్‌గా అసంబ్లీ లో ఏకగ్రీవంగా వర్గీకరణ బిల్లు ఆమోదం తెలిపిన నేపథ్యంలో సుప్రీమ్ కోర్ట్ లో కేసు వేసి వర్గీకరణ బిల్లు రద్దు చేయించారన్నారు. మాలల రిజర్వేషన్ లు కాపాడి ఆంధ్రా అంబేద్కర్ గా పేరు గాంచారన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షుడు చందక నూకరాజు, జిల్లా కార్యదర్శిలు కోరాడ సత్య నారాయణ, దేవాడసంతోష్ కుమార్, దేబారికి రామారావు, జిల్లా మహిళా అధ్యక్షులు గంధవరపు కుమారి, కార్యదర్శి మైలపల్లి ఉమా దేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు పైడిరాజు, ఆధపాక నారాయణ రావు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం శాఖా గ్రంధాలయం లో ఆదివారం చదవడం మాకిష్టం అని కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ పుస్తక పఠనం వల్ల విద్యార్థి, విద్యార్థులకు మేలు జరుగుతుందని రిటైర్డు ఎంఈఓ ఏం.సత్యన్నారాయణ అన్నారు. ఆదివారం విద్యార్థులచే కథలు పుస్తకాలు జీవిత చరిత్ర పుస్తకాలు ఇతిహాస గ్రంధాలు , నీతి కథలు, ఆధ్యాత్మిక కథలు చదివించడం జరిగింది. చిల్డ్రన్స్ క్లబ్ లో భాగంగా విద్యార్థులకు గణితం లో లెక్కలు ఎక్కములు పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి హైస్కూల్ టీచర్ లె. విస్సు మరియు విద్యార్థులు పాల్గొన్నారు అని స్థానిక గ్రంధాలయం అధికారి సి హెచ్. కృష్ణ మూర్తి తెలిపారు.

బెల్టు షాపులకు తరలిస్తున్న మద్యం పట్టివేత

విశాలాంధ్ర-మెరక ముడి దాం: మండలంలో బైర పురం నుండి శనివారం రాత్రి ఇద్దరు వ్యక్తులు ఎక్సల్ వాహనం పై మద్యం షాపు నుంచి బెల్ట్ షాపులకు మద్యం తరలిస్తుండగా. విజనగరం టాస్క్ ఫోర్స్, బుదరాయవలస పోలీస్ సిబ్బంది కలపి, 250 మద్యం బోటల్ తో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

అభ్యాస్ లో రామానుజన్ టాలెంట్ టెస్ట్ కు విశేష స్పందన



విశాలాంధ్ర -రాజాం: స్థానిక అభ్యాస్ ఇంటర్నే షనల్ స్కూల్ యందు 'నేషనల్ మేథ్మెటిక్స్ డే' సందర్భంగా 'అభ్యాస్ రామానుజన్ మ్యాథ్స్ టెస్ట్ ' నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షకు రాజాం పరిసర ప్రాంత వివిధ మండలాల నుండి అన్ని పాఠశాల విద్యార్థులు 3 నుండి 9 వ తరగతి వరకు ఎవరూ ఊహించని విధంగా సుమారు 1600 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వారి తల్లిదం డ్రులకు అభ్యాస్ విద్యా సంస్థ డైరెక్టర్ బి. రాజేష్ అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

జిల్లాలో చిన్న పరిశ్రమలకు బ్యాంకర్ల సహకారం లేదు

మంత్రి కొండపల్లి కి వినతినిచ్చిన భీశెట్టి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్: విజయనగరం జిల్లాలో చిన్న,మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటు చేద్దామనుకునే ఉత్సాహ వంతులకు కొంతమంది బ్యాంకర్లు సంబంధంలేని ప్రశ్నలు వేసి ఇబ్బందులు పెడుతున్నారని రాష్ట్ర చిన్న,మధ్య తరహాపరిశ్రమలు గ్రామీణ పేదరిక నిర్మూలనా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకువచ్చారు ఆదివారం మంత్రిని కలిసి వివరాలతో కూడిన వినతిపత్రం అందచేసిన అనంతరం భీశెట్టి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి ఇంటినుంచి ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేస్తానని ప్రకటనలు ఇస్తున్నారని వాస్తవ పరిస్థితి దానికి భిన్నంగా ఉందని ఉన్నత చదువులు చదువుకున్న ఇద్దరు వ్యక్తులు బొబ్బిలి గ్రోత్ సెంటర్లో తమకున్న చిన్న పరిశ్రమను ఆధునీకరణ చెయ్యడానికి బొబ్బిలి యూనియన్ బ్యాంక్ ని సంప్రదిస్తే గడచిన మూడు నెలలుగా తిప్పుతున్నారని,లబ్ధి దారులు తాము ఏపీఐఐసి నుండి భూమి కొనుగోలు చేశామని చెబితే ఏపీఐఐసి కి ఆ భూమి ఎలా వచ్చిందో తెలిపే కాగితాలు కావాలని అడుగుతున్నారని,తమ స్థలం ఇతర గ్యారంటీలు, తమకున్న విద్యా అర్హతలు చూసి కూడా కనీసం గౌరవం ఇవ్వడం లేదని ఆ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తనముందు ఆవేదన వ్యక్తంచేశారని భీశెట్టి తెలిపారు,ఎటువంటి గ్యారెంటీ లు లేకుండా పారిశ్రామిక అనుభవం ఉంటే 50 లక్షలు కొత్తపరిశ్రమలకి రుణాలు మంజూరు చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెపుతుంటే బ్యాంకర్ల పరిస్థితి ఇలా ఉందని,మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ అంబెడ్కర్ బ్యాంకర్ల తో సమావేశమై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సాహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, చిన్నపాటి పరిశ్రమ పెట్టాలంటే పొల్యూషన్, విద్యుత్తు, రెవెన్యూ శాఖ, ఫైర్ డిపార్ట్మెంట్ల చుట్టూ తిరిగి పర్మిషన్లు తెచ్చుకోవడం చిన్నవిషయం కాదని,బ్యాంక్ అధికారులు అర్ధం చేసుకుని సహకరించాలని భీశెట్టి కోరారు.

ప్రత్యేక పాలన మరో ఆరునెలలు పెంపు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కూటమి నేతల ఆశలపై నీళ్ళు

విశాలాంధ్ర-జామి: ప్రాధమిక సహకార సంఘాలకు ఇప్పట్లో ఎన్నికలు లేవని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ప్రస్తుతం ఉన్న ప్రత్యేక పాలన ముగియడంతో మరో ఆరునెలలుపాలు ప్రత్యేకపాలన ప్రకటించింది. దీంతో పిఎసిఎస్‌ల నామినేటెడ్ కిమిటీలపై ఆశలు పెట్టుకున్న నేతల ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్ళు చల్లింది. జిల్లాలో 95 పిఎసిఎస్‌లు ఉన్నాయి. వీటికి 2019నుంచి సహకార ఎన్నికలను గత ప్రభుత్వం నిర్వహించక పోవడంతోపాటు నామినేటెడ్ కమిటీలతో కాలయాపన చేసింది. కమిటీల పదవీకాలం అనంతరం తిరిగి అధికారులనే ప్రత్యేకాధికారికారులుగా నియమించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం మొదటి సారిగా పిఎసిఎస్‌ల ఎన్నికల పర్వం సమీపించింది. అయితే ఎన్నికలను నిర్వహించకుండా కూటమి పార్టీలలో పలువురు నేతలకు పిఎసిఎస్ పదవులతో కమిటీలను ప్రకటిస్తారని అందరూ భావించారు. కానీ అనూహ్యరీతిలో కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ప్రత్యేకాధికారుల పాలననే కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో సహకార శాఖ సిబ్బంది ఎంతో ఉత్కంఠగా ఎదురు చూసిన ప్రకటన వెలువడడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఆశావహులకు నిరాశే..

తమకు స్థానిక పిఎసిఎస్ కమిటీలలో చోటు ఇస్తారని గ్రామాలలోని చోటా నేతలు ఆశలు పెంచుకున్నారు. జామిమండలంలోని జామి, అన్నంరాజుపేట పిఎసిఎస్‌లు ఉన్నాయి. ఈ సొసైటీలకు ఇప్పటికే పలువురు పేర్లు వాడుకలోకి వచ్చాయి. అయితే చైర్మన్ పదవులు తమ అనుచరులకే రావాలని పలువురు పట్టుబట్టారు. తీరా మరో ఆరునెలలు ప్రత్యేక పాలన రావడంతో మౌనం దాల్చారు.

జనసేన పార్టీలో 50 కుటుంబాలు చేరిక

విశాలాంధ్ర -గజపతినగరం: గజపతినగరం నియోజకవర్గ మాజీ మంత్రివర్యులు జనసేన పార్టీ పీఏసీ సభ్యురాలు పడాల అరుణ [illegible] నియోజకవర్గంలోని బోండ పల్లి మండలం దేవుపల్లి గ్రామానికి చెందిన విద్యావేత్త యువకుడు ప్రముఖ న్యాయవాది రాపాక సాయి సురేష్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు వివిధ కులాలకు చెందిన వారు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. సుమారు 60 మందికి పడాల అరుణమ్మ జనసేన పార్టీ గజపతినగరం మండల అధ్యక్షులు జగన్ కండువాలు వేసి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. వీరు ఇంతవరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు జనసేన పార్టీ అరుణమ్మ నాయకత్వం నమ్మి వచ్చామని అన్నారు అనంతరం సాయి మాట్లాడుతూ గత ఆరు నెలలుగా జనసేన సభ్యత్వం తీసుకున్న కొన్ని కారణాలవల్ల రాలేకపోయానని ఇప్పుడు పవన్ కళ్యాణ్ పార్టీ సిద్ధాంతాలు అరుణమ్మ నాయకత్వం నమ్మి వచ్చానని గ్రామ ప్రజలకు చేదోడు వాదోడుగా ఉంటానని అన్నారు అలాగే ఆ గ్రామ వైసిపి నాయకులు ఇట్లా తిరుపతిరావు కూడా వారి సమక్షంలో పార్టీలో చేరి కొండవా వేసుకున్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీకి ఇటు అరుణమ్మకు మంచి పేరు తెస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీలో చేరిన సారబోయిన సింహాచలం గొద్దు కేశవరావు మలిరెడ్డి శ్యామలరావు తుంబ గంగరాజు బుడిమూడి సింహాచలం కాక ఇంకనూ 50 కుటుంబాలు చేరారు ఈ కార్యక్రమంలో గజపతినగరం జనసేన పార్టీ అధ్యక్షులు మునకాల జగన్నాధ రావు (జగన్) తాళ్లపూడి సౌమ్య త్రివేది. మండల లక్ష్మినాయుడు పడాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలి

వ్య.కా.స జిల్లా అధ్యక్షులు గొర్లె శ్రీనివాస్ పిలుపు

విశాలాంధ్ర -గజపతినగరం: గజపతినగరంలో ఆదివారం పాత్రేరి వారి కళ్యాణ మండపంలో తుపాకుల రాము అధ్యక్షతన ముఖ్య కార్యకర్తలతో సమావేశం జరిగింది డప్పు కళాకారులు చర్మ కళాకారులు ఐక్య పోరాటాల ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారం అవుతాయని దళితులకు పాలక ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలకు ఐక్యంగా పోరాడితే తప్ప వేరే మార్గం లేదన్నారు దళితులు మహిళలపై జరుగుతున్న హత్యలు అత్యాచారాలు దాడులు దౌర్జన్యాలపై సంఘటితంగా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలో పరిపాలిస్తున్న బిజెపి ప్రభుత్వం మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయడానికి సతవిధాలు ప్రయత్నం చేస్తుందని రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా రాజ్యాంగ హక్కుల్ని హరించేసే విధంగా పాలన సాగిస్తున్నారని రాష్ట్రంలో ఉన్న ప్రతిపక్షం అధికార పక్షం వాళ్లు బిజెపికి అండగా నిలబడడం వల్ల మన రాష్ట్రానికి దురదృష్టం అని అన్నారు ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు రాకోటి రాములు గోవింద రాంబాబు చింతల దేవుడు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఎంపి కలిశెట్టిని కోరిన ఎమ్మెల్యే బేబీ నాయన

విశాలాంధ్ర-బొబ్బిలి: నియోజకవర్గ పరిధిలో ప్రధాన సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుని బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబీ నాయ నని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు పలు సమస్యలపై చర్చించారు. వాటిలో ప్రధానంగా బొబ్బిలి రైల్వేజంక్షన్ కు సంబంధించిన సమస్యలపై ఎంపీ కలిశెట్టి కి ఎమ్మెల్యే బేబీనాయన వివరించారు. బొబ్బిలి స్టేషన్ వద్ద వేగన్ లోడింగ్, అన్ లోడింగ్ గూడ్స్ షెడ్ కేంద్రాన్ని ఇక్కడే కొనసాగిం చాలని కోరుతూ కళాసీ సంఘం నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. వందేభారత్ రైలుకి బొబ్బిలిలో హాల్టును కల్పించాలని కోరారు. నూతన రైల్వే స్టేషన్ నిర్మాణం జరుగుతున్నందున ఆ మార్గంగా ప్రయాణించే ప్రజలకు ఇబ్బంది లేకుండా, రైల్వే అండర్ పాస్ ను నిర్మించాలని కోరారు. అలాగే, పంచాయితీ సెక్రటరీలు కూడా తమ సమస్యలను గురించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఎంపీ సానుకూలంగా స్పందించి, ఈ సమస్యలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా ప్రయత్నిస్తానన్నారు.

సీతంలో ముగిసిన ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ కార్యశాల

విశాలాంధ్ర విజయనగరం టౌన్: స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వ ర్యంలో విద్యార్థుల కోసం ఆంధ్రప్రదేశ్ స్టేట్‌స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహించిన ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ కార్యశాలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యాశాల ఈనెల 16 నుండి 21 వరకు నిర్వహించారు దీనిలో ప్రోగ్రామింగ్ నైపుణ్యాలను పెంపొందించడం, అవసరమైన సాధనాలతో ఆండ్రాయిడ్ అప్లికేషన్ అభివృద్ధి చేయడంలో విద్యార్థులకు నైపుణ్యాలు నేర్పించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు విద్యార్థుల పురోగతిని ప్రశంసించారు, విద్యార్థులు అద్భు తమైన నిబద్ధత, వృద్ధిని ప్రదర్శించారని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి రామమూర్తి ఈ కార్యశాలలో విద్యార్థుల ఉత్సాహాన్ని, భాగస్వా మ్యాన్ని ప్రశంసించారు. కార్యశాలలో పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టి ఫికేట్‌లు ప్రధానం చేశారు. ఈ కార్యశాల విజయవంతంగా నిర్వహిం చడానికి కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ వేణు మాధవరావు, ఇతర అధ్యాపకులు, సహకారాలు అందించారు.

శ్రీ చైతన్య విద్యానికేతన్ లో ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణం సాయి నగర్ శ్రీచైతన్య విద్యానికేతన్ పాఠశాలలో కరస్పాండెంట్ గౌరీ శంకర్, ప్రిన్సిపాల్ పద్మ ఆధ్వర్యంలో ఆదివారం గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఏర్పాటుచేసిన గణిత ప్రదర్శన కు విద్యార్థుల నుండి విశేష స్పందన లభించింది.

శరవేగంగా రహదారి మరమ్మతు పనులు

నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విశాలాంధ్ర -విజయనగరం అర్బన్ : నగరంలో రహదారుల మరమ్మత్తు పనులు శరవేగంగా సాగుతున్నాయి. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో సిబ్బంది రహదారుల పాక్షిక మరమత్తు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. పాక్షిక మరమ్మతు పనులను కూడా ఏఈ స్థాయి సిబ్బంది పర్యవేక్షణలో సాగుతున్నాయి. ప్రతి పని వద్ద క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరని కమిషనర్ ఇచ్చిన ఆదేశాలతో సిబ్బంది స్వీయ పరివేక్షణలో పనులు జరుగుతున్నాయి. నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేపట్టాలన్న కమిషనర్ సూచనలతో అన్ని పనులు జాగ్రత్తగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నగరంలో రహదారుల పాక్షిక మరమత్తు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామన్నారు. ఇప్పటికే నగరంలో ఉన్న రహదారి మరమ్మత్తులను పరిశీలించి ఒక నివేదిక తయారు చేశామని దాని ప్రకారం మరమ్మతు పనులు చేపడుతున్నామన్నారు.

పర్యాటక సంస్థ డీఎంగా జగదీష్ నియామకం



విశాలాంధ్ర-విజయనగరం: రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ విశాఖ ప్రాంతీయ డివిజనల్ మేనేజర్ గా విభిన్న ప్రతిభా వంతులు, సీనియర్ సిటిజన్‌ల శాఖ సహాయ సంచాలకులు జి.వి.బి.జగదీష్ నియమితు లయ్యారు. పర్యాటక అభివృద్ధి సంస్థకు సంబంధించి ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల్లో కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించ నున్నారు. విభిన్న ప్రతిభా వంతుల శాఖ సహాయ సంచాలకులుగా ఆయన జిల్లాలో దివ్యాంగుల కోసం ఆయన అందించిన సేవలకు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల నుంచి ప్రశంసలు లభించాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ సామజిక న్యాయ మంత్రిత్వ శాఖ సహకారంతో మెగా శిబిరాలు నిర్వహించి జిల్లాలో ఒకేసారి 2,338 మంది విభిన్న ప్రతిభా వంతులకు రూ.3.25 కోట్లు విలువ చేసే బ్యాటరీతో నడిచే మోటార్ సైకిల్ లు, ఇతర ఉపకరణాలు రాష్ట్రంలోనే మొదటి సారిగా అందించారు. దీనితో పాటు కలెక్టర్ కార్యాలయంలో అందించే వినతులపై దివ్యాంగులకు వెంటనే ఉపకరణాలు అందజేసి వారి సమస్యల పరిష్కారం లో తోడ్పాటు అందించేవారు. విభిన్న ప్రతిభా వంతుల ఏ.డి.గా ఆయన స్థానంలో ఆ శాఖ అధికారులు ఇంకా ఎవరినీ నియమించ లేదు.

తహశీల్దార్ కార్యాలయ ప్రధాన విభాగాల్లో ఖాళీలు భర్తీ కాక సిబ్బంది ఇబ్బందులు

విశాలాంధ్ర-బొబ్బిలి:పట్టణ, మండల ప్రజలకు రెవిన్యూ సేవలందించడానికి పట్టణ, గ్రామీణ ప్రజలకు రెండు తహశీల్దార్ కార్యాలయాలు ఏర్పాటుచేసి ప్రజలకు సేవలు అందించవలసిన తహశీల్దార్ కార్యాలయం లో అదనపు సిబ్బంది నియామకం చేయలేదు సరి కదా గతంలో ఉన్న సిబ్బందిని కూడా నియామకం లేక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బదిలీలతో ఖాళీలు ఏర్పడిన సిబ్బందిని ఆయా విభాగాల్లో సిబ్బందిని నియామకు చేయక బొబ్బిలి తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తించాలంటే సిబ్బంది హడలి పోతున్నారు. అదేవిధంగా కూటమి అధికారంలోకి అధికారులకు వచ్చిన తర్వాత గ్రామ రెవెన్యూ అధికారులు ను బదిలీ చేశారు. ప్రధానంగా పిరిడి, పక్కి, చింతాడ, పారాది, తదితర గ్రామాల్లో నేటివరకు గ్రామ రెవెన్యూ అధికారులను నియామక చేయక ఉన్న గ్రామ రెవెన్యూ అధికారులను ఇన్చార్జిలుగా నియామకం చేశారు. గ్రామ రెవెన్యూ అధికారులకు రెవెన్యూ విధులు లే కాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు పరిశీలన, తదితర విధులు నిర్వర్తించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఇన్చార్జి విధులు నిర్వర్తిస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రధాన విభాగాల్లో ఎలక్షన్, సివిల్ సప్లై, రెవిన్యూ విభాగం లో గతంలో బదిలీలతో ఖాళీలు ఏర్పడిన సిబ్బందిని నియమించారు. జిల్లా అధికారులు తగినంత సిబ్బంది నియామకం చేయక ఉన్న సిబ్బంది విధులు నిర్వర్తించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయంలో జూనియర్ సహాయకులు , జూనియర్ సహాయకులు మరియు కంప్యూటర్ ఆపరేటర్, సీనియర్ సహాయకులు, సివిల్ సప్లై విభాగంలో ఈ ఆర్ ఐ, ఎన్నికల విభాగంలో సీనియర్ నాయకులు సిబ్బంది లేక ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపతాహసిల్దార్లు ప్రభుత్వ విధులు నిర్వర్తించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రెవిన్యూ శాఖ మంత్రి, జిల్లా మంత్రి,జిల్లా కలెక్టర్ అంబేద్కర్ స్పందించి తహశీల్దార్ కార్యాలయం కు పూర్తిస్థాయిలో సిబ్బందిని నియామకం కోసం తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బంది ఖాళీలపై తహశీల్దార్ ఎం శ్రీను వివరణ

తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బంది ఖాళీల పైన తహశీల్దార్ ఎం శ్రీను ను విశాలాంధ్ర వివరణ కోరగా జిల్లా అధికారులకు సిబ్బంది నియామకం కోసం నివేదికలు పంపించామని జిల్లా అధికారులు సిబ్బంది నియామకోసం చర్యలు తీసుకుంటారని తెలిపారు.

నీట మునిగిన పంటలు....

మమ్మల్ని ఆదుకోవాలంటున్న రైతులు



విశాలాంధ్ర -రాజాం: బంగాళా ఖాతంలో ఏర్పడిన వాయు గుండం ప్రభావంతో గత మూడు రోజులు కురిసిన వర్షాలు రైతులకు కన్నీరు పెట్టించింది. రాజాం మండలంలోని పలు గ్రామాలతో పాటు గుయ్యానవలస గ్రామంలో పెసర పంటలో వర్షపు నీరు నిలిచి పెసలు మొలకెత్తి పంట పూర్తిగా పాడయింది. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట సాగు చేయగా వర్షం వల్ల పంటచేలలో నీరు నిలిచి కళ్ల ముందే పంటలు పాడయ్యాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.